# మాష్టారిని చూడాలని ఉంది

శీతాకాలమేమో - సాయంత్రం ఐదయ్యేసరికే చీకట్లు ముసురుకుంటున్నాయి, వీధి వరండాలో ఈజీఛైర్‌లో కూర్చుని వాకిలివైపు చూస్తున్నాను.

మరిడయ్య వాడికి వచ్చిన తెలుగు - హిందీ సినిమా పాటలు సగం సగం పాడుతున్నాడు. వాడు మతి చలించిన మనిషి, ఎవరు పొమ్మన్నా పోడు. పైగా 'మీకు మర్యాద తెలియదు. ఇంటికి వచ్చినవాణ్ణి పొమ్మంటారా?' అని తగవుకు వస్తాడు. అందుకని ఎవరం వాణ్ణి పట్టించుకోం.

ప్రతి సాయంత్రం వాడు వచ్చి ఏదో వాగి నాలుగు పాటలు పాడటం మాకు అలవాటయిపోయింది. వాడు రాకపోతే, 'మరిడయ్య యివాళ రాలేదమ్మా?' అనుకుంటాం నా చిన్నకొడుకు బుచ్చిగాడితో సహా.

వాడు పిచ్చివాడవటానికి చాలా కారణాలు చెప్తుకుంటారు. ఆ ఊరి జనం, 'పెళ్ళాం లేచిపోయిందనీ, వాడు చేసే రైల్వే ఉద్యోగంలోంచి అన్యాయంగా తీసేశారనీ, పొలం నీటి తగువులో ఎవరో తలపై బలంగా కొట్టారనీ, వీదిపమైనా మరిడమ్మ మాటల్నిబట్టి అతను బాగా బ్రతికిన రోజుల్లో మంచి మనిషయి ఉంటాడని తోస్తుంది.

మా ఆవిడ కిరసనాయిలు లైట్లు వెలిగించింది, అది చిన్న పల్లెటూరు. నేను పనిచేసే బ్లాకు అక్కడికి నాలుగు మైళ్ళ దూరం వుంటుంది. అద్దె తక్కువ అని యీ వూళ్లో వుంటూ, సైకిలుమీద ఆఫీసుకి వెళ్ళి వస్తుంటాను.

మరిడయ్య యింకా పాడుతున్నాడు. దూరంనుంచి ఎవరో వ్యక్తి మా ఇంటివైపే వస్తూ కనిపించాడు.

'ఎవరు చెప్మా?' అనుకుని నేను ఈజీఛైర్‌లోంచి లేచాను.

అతను నేరుగా మా ఇంటివైపే వస్తున్నాడు. చంకన గొడుగు, నెరసిన ఉంగరాలజుట్టు, తెల్లని పంచకట్టు, లాల్చి, ఆకు చెప్పులు.

పకాల్న నవ్వి, "అరె! నరసింహం? నన్ను గుర్తుపట్ట లేదూ?" అన్నాడతను.

ముడతలుపడ్డ అతని ముఖంలోకి చూసి, నేను అనుకున్న వ్యక్తి అవునో, కాదో అనే అనుమానంతో, "మీరు సంగీతం మాష్టారు సర్వేశ్వరరావుగారు కదూ?" అన్నాను.

"నయం. పోల్చావు. నువ్వెవరో నాకు తెలియదు పొమ్మంటావనుకున్నాను, ఆ సంగీతంమాష్టారువే" అని అతను

అనేసరికి, "రండి మాష్టారూ! నమస్కారం. బాగున్నారా? కూర్చోండి" అని కుర్చీ చూపించాను.

అతను అలసినట్లు కుర్చీలో కూర్చుంటూ, మన ఊరు వెళ్ళే బస్సు పాడయిందోయ్. ప్యాసింజర్లంతా ఏదో దొరికిన లారీ, బస్సూ ఎక్కి వెళ్ళిపోయారు. నాకేమీ దిక్కుతోచక నువ్విక్కడున్నావని తెలిసీ..." అని నా ముఖంలోకి చూశారు.

"మంచిపని చేశారు. బస్సు పాడవ్వకపోతే, మా ఇంటికి వచ్చేవారా?" అని లోపలికి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చాను.

"పిల్లలంతా బాగున్నారా మాష్టారూ? అమ్మగారు బాగున్నారా? మీరు రిటైరయ్యా రనుకుంటాను" అన్నాను అతని కుర్చీదగ్గిరవున్న బల్లమీద కూర్చుంటూ.

"ఆఁ! అంతా బాగున్నారు" అని అదోలా నవ్వుకొని, "ఏమిటి? ఏం ఉద్యోగం చేస్తున్నావు? ఎందరు పిల్లలు?" అడిగాడు నవ్వుతూ.

బ్యాంకాఫీసులో గుమస్తాగా చేస్తున్నాను. నలుగురు పిల్లలు. ఇద్దరు మగ, ఇద్దరు ఆడా. మీ పిల్లలంతా పెద్ద వాళ్ళయిపోయి ఉంటారు. పెళ్ళిళ్ళయిపోయాయా?" అన్నాను.

"వయసు వస్తే, అవకేం చేస్తాయి. నీ పిల్లలకి ఈ ఊళ్లో స్కూలుందా?" ఆయన ప్రశ్న.

"ఏదీ చిన్నపిల్లలు. ఐదవ క్లాసుదాకా ఈ ఊళ్ళో చిన్న బడి వుంది" అన్నాను.

ఈ పూట మీ ఇంట ఆతిథ్యం స్వీకరించక తప్పదు మరి" అన్నారు మాష్టారు.

"అయ్యో! ఎంతమాట? తప్పకుండా. నేనే మిమ్మల్ని ఓసారి పిలవాలనుకుంటున్నాను" అబద్ధమే ఆ మాట.

మాస్టారు భోజనానికి వుంటున్నారని బంగాళదుంప కూరా, కొబ్బరి పచ్చడీ, సాంబారూ. అన్నంలోకి ఆధరువు చెయ్యమన్నాను మా ఆవిణ్ణి.

"పొద్దుపోయాక ఏమిటండీ ఈ పురమాయింపులు?" అని విసుక్కుంటూనే వంట చేసింది మా ఆవిడ.

అంతవరకూ తన రిటైర్‌మెంటూ, ప్రావిడెంటుఫండూ, పెన్షనూ ఇవ్వటానికి జిల్లాపరిషత్ వాళ్లు ఎన్ని తిప్పలు పెట్టిందీ చెప్పారు మాస్టారు.

"అర్ధరాత్రి అమ్మాయిని హింసపెట్టి ఇవన్నీ యెందుకు చేయించావయ్యా!" అంటూనే మాస్టారు తృప్తిగా భోంచేశారు.

మాస్టారుకి వరండాలో మంచం, పరుపువేసి, కాళ్ళ వైపు కాశ్మీరుశాలువ పెట్టి, "పడుకోండి మాస్టారూ!" అన్నాను.

ఆయన సంతోషంగా నవ్వుకుంటూ మంచంమీద కూర్చుని, "సంగీత సాధన ఏమన్నా చేస్తున్నావా?" అడిగాడు.

నవ్వి, "ఈ సంసారమే ఓ పెద్ద సంగీతం. ప్చ్! చిన్నప్పుడు సంగీతం, పాటలసరదా! అవన్నీ పోయాయి మాస్టారూ! ఇప్పుడు బండిలాగే యెద్దును" అన్నాను.

బాధగా నవ్వి, "అలా అనకోయ్, ఈ సంసారం ఈద టంలో కూడా ఓ ఆనందముంది" అన్నారు.

ఆయన పక్కన నేను మడతమంచం వాల్చుకున్నాను. ఎక్కడినుంచో మరిడయ్య కేకలూ, మాటలూ వినిపిస్తున్నాయి.

"ఆ అరుపులవాడెవడు? ఇందాక మీవాకిట కూర్చున్న వాడేనా?" అన్నారు మాస్టారు.

"ఔను. పాపం-పిచ్చివాడు!" అన్నాను.

"అదృష్టవంతుడు" అన్నారు మాస్టారు.

"అదేమిటి? పిచ్చివాడు అదృష్టవంతుడా?" నవ్వుతూ ప్రశ్నించాను.

"కాదా మరి? దూషణ, భూషణ తిరస్కారాలకు అతీతుడై పోయాడు" అన్నారు మాస్టారు.

'నిజమేనేమో!' అనిపించింది.

ఇంతలో మాస్టారు గుర్రుపెట్టడం మొదలు పెట్టారు.

*    *    *

అర్ధరాత్రి దాటి వుంటుంది. "నిన్ను చంపేస్తాను లంజాకొడకా-దాని వంటిమీద చెయ్యివేశావా?" అని అరిచారు మాస్టారు. అంతకుముందేం కలవరించారో, నాకు మెలుకువ వచ్చి విన్న మాట యిది. చివాలున లేచి కూర్చుని, ఇంకా ఏమిటో గొణుగుతూన్న మాస్టార్ని తట్టి పిల్చాను మాస్టారూ' అని.

ఆయన లేచి కూర్చున్నారు. అతని కనులు తడిగా వున్నాయి. "ఛీ పాడుకల, కలేమిటి? జరిగే వుంటుంది" అని ఆయన ఏడుస్తున్నారు.

నేను లేచివెళ్ళి ఆయన పక్కన కూర్చుంటూ, మాస్టారూ! ఇంకా పూర్తిగా మెలకువ రాలేదా?" అన్నాను ఆయన భుజంమీద చెయ్యివేస్తూ.

"మెళకువ వచ్చిందోయ్" అన్నారు. ఆయన గొంతు దుఃఖంతో బరువుగా ధ్వనించింది.

"ఐతే ఇదేమిటి?" అడిగాను ఆయన ముఖంలోకిచూసి.

"ఏం చెయ్యమన్నావు? ఆ వెధవ...దుర్మార్గుడు పిల్లను కాల్చుకుతింటున్నాడు" అన్నారు.

"ఎవరు?" అన్నాను అర్థంకాక.

"మా మూడో పిల్ల మొగుడు" అన్నారు మాస్టారు.

ఇంకేమిటి అడగాలో తెలియక నేనూ, కలనే నెమరు వేసుకుంటూ మాస్టారూ—రెండు నిమిషాలు మా ఇద్దరిమధ్యా నిశ్శబ్దం తాండవించింది.

"ఏమిటోనోయ్! ఈ ఆడపిల్లలతో బొత్తిగా మనస్సుకి శాంతి లేకపోయింది. ముగ్గురికీ ముగ్గురూ ఓలానే ఉన్నారు" అన్నారు మాస్టారు-కనులు వత్తుకుంటూ.

మిగతా విషయాలు కూడా ఆయనే చెబుతారని, మౌనంగా అలాగే కూర్చున్నాను.

"పెద్దది నీకు తెల్సుకదూ? దాన్ని కావల్సినసంబంధమే మా మేనల్లుడికిచ్చి పెళ్ళిచేశాను. ఆ పెళ్ళికి మిర్రినాయుడు గొప్ప సాయం చేశాడులే. నాకు వున్నంతలో ఘనంగా పెళ్ళి చేశాను. పొరుగింటి కుర్రాడివైపు చూసేదనీ, వాడికేదో తెలివితక్కువగా ఉత్తరం వ్రాసిందనీ దాని మొగుడు దాన్ని నానా బాధలూ పెడుతున్నాడిని తెలిసి మన యింటికి తీసుకు వచ్చేశానోయ్. అది నా కళ్ళల్లో దుమ్ముకొట్టింది" అన్నారు

"ఏం చేసింది మాస్టారూ?" చప్పున అడిగాను.

"ఏదో వెధవ పని చేసిందిలే. నీకు తెలియదూ? నేను ఎంత గుట్టుగా, మర్యాదగా సంసారం ఈదే వాడినో నాపరువు బజార్న పెట్టింది. జాతి తక్కువ వెధవతో వెళ్ళిపోయింది."

నేను అవాక్కయిపోయినాను.

"రెండవది స్కూలుఫైనల్ చదివింది. తెలివిగా చదువుతూంది - అనుకొని సంతోషించేవాణ్ని. అది ఓ రోజు, మన వూరి నాయుడి కొడుకుని గుళ్ళో పెళ్ళి చేసుకొనివచ్చి కాళ్ళకు దణ్ణంపెట్టింది' నేను 'ఛీ. పో, నాకు ముఖం చూపించకు' అని పొమ్మన్నాను. కాని యెక్కడికి పోయింది? నా కనుల ఎదుటే మన ఊర్లోనే వాడికి ముగ్గురు పిల్లల్ని కని, వాడికి చేపా మాంసం, వండిపెడుతూ, సాయంత్రం తాగివచ్చే మొగుడితో తాపులుతింటూ నరకాన్ని సృష్టించుకుంది బ్రతుకులో. ఒక్కోసారి సహించలేక అడ్డంపడతాను - 'వెధవా! దాన్నెందుకురా అలా కొడతా' వని. వాడు నన్నూ కొట్టబోతాడా మైకంలో. దాని బ్రతుకలా ఉంది" అని మరొక్క

సారి నీరు చిమ్మిన కనులు వత్తుకుని "వీణ్నెందుకు పెళ్ళాడేవే" అంటే- "నువ్వు నాకు పెళ్ళిచెయ్యగలవా?" అని అడిగిందది. ఓసారి... ఏమిటి చెప్పమంటావ్" అని నవ్వారు మాష్టారు. ఆ నవ్వు-మండే మనస్సులోంచి వచ్చిన సెగలా, పొగలా ఉంది. ఇంకా పిచ్చి నవ్వులా వుంది.

"మూడోది లక్ష్మి బంగారు బొమ్మలా ఉంటుంది. వాడికేం పొయ్యే కాలమో! దాన్ని బంధించా డిట్లో. వీధిలో, పెరటిలోకి రానివ్వడు. గుమ్మాలకి గుడ్డలు! దానిమీద వాడికి అనుమానం. మహాగొప్ప బాధ పెడుతున్నాడోయ్ పిల్లను తీసుకు వచ్చేస్తానంటే మీ అమ్మగారు వప్పుకోవటంలేదు. వాళ్ళే సర్దుకుంటారు. జోక్యం పెట్టుకోకండి అంటుంది. కాని, నేను సహించలేక పోతున్నానోయ్" అన్నారు మాష్టారు.

ఓ నాటి ఈ మాష్టారి ప్రవర్తన గుర్తొచ్చి నవ్వుతూ, "కడుపు తీపి మాష్టారూ! మరి-సహించలేరు నిజమే. కాని, సహించటమే ఓ రకంగా మంచిది. సుబ్బారావు ఏమిటి చేస్తున్నాడు?" అడిగాను. సుబ్బారావు మాష్టారుగారి పెద్దకొడుకు. మాష్టారిగారికి- ఇద్దరు కొడుకులూ. ముగ్గురు కూతుళ్ళూ.

"వాడు యాక్సిడెంట్లో పోయాడోయ్" అన్నారు మాష్టారు రుద్ధకంఠంతో.

నిజంగా నా మనస్సు బాధపడింది "అరె!" అన్నాను, "అందుకే నాకన్నా ఆ పిచ్చివాడు అదృష్టవంతుడు అన్నాను. రెండవవాడు పట్నంలో, ఓ కోమటికొట్లో పద్దులు రాస్తున్నాడు. నేను ఓ నలుగురు పిల్లలకు సంగీత పాఠాలు

చెబుతున్నాను. సర్లే పడుకో, నా సోదితో నిన్ను నిద్రపోకుండా ఇబ్బంది పెట్టాను'' అని తను పడుకున్నారు మాస్టారు.

నేనూ నా మంచంమీద పడుకున్నాను కాని, నాకు నిద్రపట్టలేదు. గతంలోకి జారింది నా మనసు...

* * * *

నేను మా ఊళ్ళో ఆరవతరగతి చదివేటప్పుడు, మా క్లాసు మాస్టారే సంగీతం మాష్టరు, అతని దగ్గర ఆడపిల్లలు మగపిల్లలు పది, పదిహేనుమంది సంగీతం నేర్చుకునేవారు.

రోజూ సాయంత్రం రామాలయం అరుగుమీద సంగీతం పాఠాలు చెప్పేవారు మాస్టారు. నేను అక్కడ కూర్చుని వినేవాణ్ని. ఇలా ఒక నెలరోజులు గడిచాక, "ఏరా నర్సీ! నువ్వుకూడా సంగీతం నేర్చుకుంటా వేమిట్రా?'' అడిగాడు మాస్టారు.

"అమ్మ జీతం ఇవ్వాదండీ'' నేనన్నాను తలవంచుకుని.

"మసలో మనకి జీతాలేమిట్రా? రా కూర్చో''

అన్నారు మాస్టారు. నేనూ సంగీత శిష్యుల్లో ఒకణ్ని అయిపోయాను. సంగీతంమీద ఉండే అభిరుచి వల్లనో ఏమో వారం ఠర్ని మించిపోయాను. రెండు నెలల్లో, మాస్టారు క్రొత్తగా చేరే సంగీత శిష్యుల్ని నాకు పాఠాలు చెప్పమని వప్పగించేవారు. కొద్ది రోజుల్లోనే నేను మాస్టారికి ప్రియ శిష్యుణ్ని అయిపోయాను. నన్నందరూ రాజవైద్యుడు అని వేళాకోళం చేసేవారు. ఎందుకంటే మాస్టారి ఇంట్లోకి నాకు తప్ప ఇంకెవరికీ ప్రవేశముండేది కాదు. మాస్టారికి ఎందుకో- భార్యమీద అనుమానం అయి ఉంటుంది- బయటికి రానిచ్చేవారు కాదు.

గుమ్మాలకి తెరలు, వరండాకు తడికలూ, సంగీతం మాస్టారు భార్యకు ఘోషా అని అమ్మ లక్కలు చెవులు కొరుక్కునే వారు. మాస్టారు ప్రతిరోజు ఉదయం, సాయంత్రం క్లాసు టయిములో ఓసారి నేను ఆయన ఇంటికి విధిగావెళ్ళి వచ్చే వాణ్ని. మాస్టారు పంపించేవారు. మాస్టారు భార్య యాలక పొడివేసిన పాలు, లేక సేమ్యా, సగ్గుజావ-ఏదో నాచేతికిచ్చేది. అది మాస్టారి కిచ్చేవాణ్ని.

నేనురాగానే, "చుట్టాలెవరన్నా వచ్చేరేమిట్రా నర్సీ!" అని అడిగేవారు మాస్టారు. "లేదండీ!" అనేవాణ్ణి నేను. చాలారోజుల తర్వాత అందరూ అనుకోవటం, నేను గ్రహించటం జరిగింది-తాను లేనివేళ్ళల్లో భార్య ఎవరితోనన్నా మాట్లాడుతూందేమో - అనే అనుమానంతో, నన్ను ఇంటికి పంపిస్తుంటాడని, తర్వాత రోజూ ఇంట్లోవాళ్లు చారు అన్నం తిన్నా, ఇతను పాయసాలు తాగుతాడనీను!

తర్వాత మేం ఆ ఊరునుంచి మకాం మార్చేశాం. పాతిక సంవత్సరాల తర్వాత మళ్ళీ యివ్వాళ మాస్టార్ని చూశాను.

ఏవేవో గత స్మృతులతోనే నిద్రలోకి జారాను.

* * *

తెల్లవారి లేవగానే మాస్టారు వెళ్ళిపోయారు.

రెండు నెలలు తర్వాత విశాఖపట్నం మెయిన్‌రోడ్‌లో ఓ హోటల్ ముందు మాస్టారి కొడుకు సుబ్బారావులా ఓ

వ్యక్తి కనిపిస్తే, అతని దగ్గరగా నడిచి, ఓసారి పరిశీలనగా చూసి, "మీరు...మరేం మనుకోకండి-మీ పేరు?" అన్నాను.

"సుబ్బారావు" అని అతను నా ముఖంలోకి పరిశీలనగా చూస్తూ నన్ను గుర్తుపట్టాడు.

మాస్టారు మా ఇంటికి వచ్చి మాట్లాడిన మాటలన్నీ చెప్పి, "అలా అన్నారేమిటి?" అన్నాను.

"అమ్మనోసారి దవడమీద కొట్టారు. ఆ దెబ్బ గూబమీద పడేసరికి, అమ్మ క్రింద పడిపోయి అప్పటి కప్పుడు చనిపోయింది. ఆ షాక్‌తో ఆయన మతి చలించింది. నాన్నగారు ఎన్ని రోజుల క్రితం మీ ఇంటికి వచ్చారు?" అని అడిగి, అక్కయ్యా, చెల్లెళ్ళు, సుఖంగా కాపురాలు చేసుకుంటున్నారు. నేను పోస్టల్ డిపార్టుమెంటులో పనిచేస్తున్నాను. తమ్ముడు రైల్వేలో పనిచేస్తున్నాడు. మా ఇద్దరికీ పెళ్ళిళ్ళయాయి పిల్లలు కూడా!" అన్నాడు సుబ్బారావు.

"మరి మాస్టారు అలా చెప్పారేమిటి?" అన్నాను.

"తను చేసినదానికి. తనకు ఏ రకమయిన శిక్షపడాలో ఆయన గాఢంగా కోరుకుంటూ వుండాలి. మేమంతా చావా చావాలనీ, కష్టాలపాలవ్వాలనీ ఆయన ఉద్దేశం కాకపోవచ్చు. అలా జరిగితే, తండ్రిగా తనకు ఏర్పడే రంపపుకోత, తన కనవసరమని ఆయన భావిస్తూ వుండాలి. అందుకే మీ బోటి శిష్యుల అందరి ఎడ్రస్‌లూ సేకరించి, యింటింటికీ వెళ్ళి యీ వెర్షన్ చెబుతున్నారాయన. ఆయన చెబుతున్నంత ఘోరంగా మా అమ్మని హింసించారేమో తెలియదు. ఇవన్నీ మన

స్సులో పెట్టుకోవలసిన విషయాలు, వీధినపడి చెప్పుకోవట మంటే మరి 'పిచ్చే' కదా! ఏమంటారు!" అన్నాడు సుబ్బా రావు.

నేను మాట్లాడలేదు.

మాస్టారే నాకళ్ళలో కదులుతున్నారు. మళ్ళీ ఆయన్ని చూడాలనిపిస్తోంది. మా యింటిముందు ప్రతి ఆదివారం కని పించి లల్లాయి పాటలు పాడే 'మరిడయ్య' పాటలు విన్నప్పు డల్లా, సంగీతం మాస్టారు నా మనస్సుని కలవరపెడుతూ వుంటారు.

—:o:—